సాక్షి
జనగామ

శనివారం | 11 | అక్టోబర్ | 2025



బ్రోకర్ మాటల్లో నేర్పరి సీఎం

బ్రోకర్ మాటలు మాట్లాడడంలో సీఎం రేవంత్ రెడ్డి నేర్పరి అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. - 8లో▸



రైల్వే కార్మికులకు మెరుగైన వైద్యం

రైల్వే కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రైల్వేశాఖ నిరంతరం కృషి చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే పీసీఎండీ డాక్టర్ నిర్మలారాజారాం అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది.

న్యూస్‌రీల్

వేల్పుగొండ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



జఫర్‌గఢ్: మండల కేంద్రంలో వేల్పుగొండ కొండ దిగువన ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు స్వస్తి వాచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, ఆరగింపు, తీర్థప్రసాదగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రెండో రోజు ఉదయం పారాయణం, సుదర్శనారసింహ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, సాయంత్రం సమయంలో నిత్యహవనం, బలిహరణం, ఆరగింపు, తీర్థగోష్ఠి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వెంకటచార్యులు తెలిపారు. పూజాకార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసచార్యులు, కృష్ణమచార్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

కొత్త టీచర్ల 'ఏడాది' సంబురాలు



జనగామ: జిల్లాలో 200మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉద్యోగంలో చేరి శుక్రవారం నాటికి ఏడాది పూర్తి చేసుకున్నారు. టీచర్ల నియామకంతో గత ఏడాది నుంచి సర్కారు బడులకు కొత్త కళ వచ్చింది. 2024 డీఎస్సీ ద్వారా జిల్లాలో 221 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా 200 పోస్టులను భర్తీ చేశారు. అనేక సంవత్సరాలుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఆందోళనలు చేసిన అభ్యర్థులు.. 2024 డీఎస్సీ ద్వారా తమ కల సాకారం చేసుకున్నారు. అక్టోబర్ 9వ తేదీ ఎల్బీస్టేడియంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఉద్యోగంలో ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా, కొత్త టీచర్లు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంబురాలు జరుపుకున్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి



జనగామ రూరల్: బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆదేశాల మేరకు ఇంటర్నేషనల్ చైల్డ్ డే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పోక్సో చట్టం ప్రకారం ఎవరైనా బాలికలపై అఘాయిత్యం చేస్తే వారికి 10 సంవత్సరాలపైబడి శిక్ష పడే అవకాశం ఉందన్నారు. భరోసా సెంటర్ కోఆర్డినేటర్ బి.సుధ గుడ్ టచ్.. బాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ నెల పొలంబాట



జనగామ: జిల్లాలో విద్యుత్ శాఖ అధికారులు ప్రతీ నెల క్రమం తప్పకుండా పొలంబాట నిర్వహించాలని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ మధుసూదన్ ఆదేశించారు. జనగామ సర్కిల్‌లో గత నెలలో చేరుకున్న లక్ష్యాలు, ప్రస్తుత నెలలో చేయబోయే కార్యక్రమాలపై ఎస్ఈ టి.వేణుమాధవ్‌తో కలిసి నిర్వహించిన సమీక్షలో పాల్గొని మాట్లాడారు.. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా, వల్నరబుల్ లొకేషన్లను ముందుగానే గుర్తించి, వెంటనే రెక్టిఫై చేయాలన్నారు. అలాగే 33 ఇంటర్ లింకింగ్ లైన్స్ పూర్తి చేసి, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్, అంతరాయాలు తగ్గించాలని సూచించారు. ప్రతీ నెల పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, వ్యవసాయ కనెక్షన్లను వెంట వెంటనే ఇవ్వాలన్నారు. సమీక్షలో చీఫ్ ఇంజినీర్ రాజుచౌహాన్, టెక్నికల్ డీఈ గణేశ్, ఎస్ఏవో జయరాజు, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ డీఈలు లక్ష్మీనారాయణరెడ్డి, రాంబాబు, ఎంఆర్టీ డీఈ విజయ్‌కుమార్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పోరాటాల ఖిల్లాకు పదేళ్లు

నేడు పదో వసంతంలోకి అడుగిడనున్న జిల్లా

- ప్రగతిపథంలో పయనిస్తున్న ఉద్యమాల గడ్డ
- ఆనాడు జిల్లా కోసం 500 రోజుల ఉద్యమం
- జైలు జీవితం గడిపిన 55 మంది ఉద్యమకారులు
- సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు



1. జిల్లా సాధన కోసం ర్యాలీ
2. నిరసనల హోరుతో అరెస్టులు
3. జనగామ కలెక్టరేట్ సమీకృత కార్యాలయ సముదాయం
4. జిల్లా కోసం 2015లో మొట్టమొదటి దీక్ష ప్రారంభం
5. జనగామ ఆర్టీసీ చౌరస్తాలో మానవ హారం(ఫైల్)

జనగామ: పోరాటాల పునాదులపై పురుడు పోసుకున్న జనగామ జిల్లా శనివారం(ఈనెల 11న) తొమ్మిది వసంతాల ప్రయాణం పూర్తి చేసుకుని పదో వసంతంలోకి అడుగేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అనంతరం ఏర్పడిన కొత్త జిల్లాల్లో, జనగామ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. జనగామ జిల్లా ఏర్పాటు చేస్తామని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినా.. జనగామ పేరు పునర్విభజన జిల్లాల జాబితాలో లేకపోవడంతో ఉద్యమ జ్వాల రగిలింది.

రెండేళ్ల పాటు నిరంతర పోరాటం

జిల్లా సాధన కోసం ప్రజలు ఏడాదికిపైగా నిద్రాహారాలు మానుకుని పోరుబాట సాగించారు. 500 రోజుల ఉద్య మం సాగగా, 250 రోజుల రిలే దీక్షలు, 200రోజుల పాటు 144 సెక్షన్ నిర్బంధం కొనసాగింది. ఎగిసి పడ్డ ఉద్యమంతో ఈ ప్రాంత ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. జిల్లా కోసం సాగిన పోరులో పోలీసుల ముందస్తు అరెస్టులు, జైళ్లకు తరలింపులు, నిరసనలు ఇవన్నీ నేటికీ ప్రజల జ్ఞాపకాలలో నిలిచిపోయాయి.

అగ్నిగుండంలా మారిన ఉద్యమం

నాటి ప్రభుత్వం జనగామను జిల్లాల జాబితాలో చేర్చాలంటూ జరిగిన ఉద్యమం ఒక్కసారిగా అగ్నిగుండంలా మారింది. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రతిరోజూ జరిగే రాస్తారోకోలతో రవాణా వ్యవస్థ స్తంభించి పోయింది. ప్రభుత్వానికి నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు వెల్లువెత్తాయి. 12 గంటల పాటు సాగిన ఓ నిరసనలో ఆర్టీసీ బస్సు దహనం కావడంతో ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ఈఘటనలో అనేక మందిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు.

పోరాట ఫలితం.. జిల్లా అవతరణ

సమాజంలోని అన్ని వర్గాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, రైతులంతా జనగామ జిల్లా కావాలనే స్వరం వినిపించారు. చివరకు ప్రజల డిమాండ్ ముందు ప్రభుత్వం దిగి రాక తప్పలేదు. 2016 అక్టోబర్ 11న అధికారికంగా జనగామ జిల్లా ఆవిర్భావం చెందింది. నాటి ముహూర్తం నుంచి ఈ ప్రాంతం అభివృద్ధిలో వేగంగా అడుగులు వేస్తోంది.

నేడు ఆవిర్భావ దినోత్సవం

జిల్లా ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో జిల్లా 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకోనున్నారు. ఉదయం 10 గంటలకు వేడుకలను ప్రారంభించడం జరుగుతుందని జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళ్లపల్లి రాజు తెలిపారు. ప్రజలు, ఉద్యమకారులు, అన్ని వర్గాల ప్రజల సహకారంతో జనగామ మరో మైలురాయిని చేరుకుంటుందన్నారు. జిల్లా ఉద్యమ చరిత్రను గుర్తు చేస్తూ ఉద్యమకారులు పలు డిమాండ్లు విడుదల చేశారు.

అభివృద్ధి పథంలో..

ఇప్పటికే విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, తదితర రంగాల్లో జిల్లా సరికొత్త శకం ప్రారంభించింది. జిల్లాకేంద్రం ఆధునిక సౌకర్యాలతో కళకళలాడుతోంది. కొట్లాడి తెచ్చుకున్న జిల్లాగా పేరుపొందిన జనగామ రాష్ట్రంలో అభివృద్ధి ప్రతీకగా నిలుస్తోంది. అయినప్పటికీ గత, ప్రస్తుత ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కోసం పోరాడిన అనేక మంది ఉద్యమకారులు సైతం నేటికీ కోర్టు కేసుల్లో తిరుగుతూ, ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతూ ప్రభుత్వం నుంచి ఆదరణ లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యమకారుల డిమాండ్లు:

- స్థానిక యువతకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలి.
- జిల్లా ఉద్యమచరిత్రకు గుర్తుగా ఉద్యమ స్థూపం నిర్మించాలి.
- జనగామ రూరల్, అర్బన్ మండలాలతో కలిపి జిల్లా పరిధిని 16 మండలాలుగా విస్తరించాలి.
- జిల్లాకు ఎస్పీ కార్యాలయం హోదా కల్పించాలి.
- జిల్లా కేంద్ర అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి.
- మ్యూజియం, అంబేడ్కర్ ఆడిటోరియం, ఆధునిక స్టేడియం నిర్మించాలి.
- నిలిచిపోయిన ప్రభుత్వ ఐటీఐ, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నిర్మాణాలు పూర్తి చేయాలి.
- కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలి.
- పాలకుర్తిని మున్సిపాలిటీగా ప్రకటించాలి.
- మహిళల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించాలి.
- రంగప్ప చెరువు సుందరీకరణతో పాటు మినీ పార్కులు ఏర్పాటు చేయాలి.
- సర్వాయి పాపన్న గౌడ్ వీరత్వానికి చిహ్నంగా ఖిలాషాపురం కోట పునరుద్ధరించాలి.
- మాణిక్యపురంలో చుక్క సత్తయ్య కళాక్షేత్రం ఏర్పాటు చేయాలి.
- సిద్దులగుట్ట, జీడికల్, పాలకుర్తి, చీటకోడూర్, బాణాపురం దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.
- మోడల్ మార్కెట్‌ను పూర్తి చేయాలి.
- జిల్లా ఆసుపత్రిలో ఎమ్మారై, ఆంజియోగ్రామ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.
- చంపక్‌హిల్స్, చీటకోడూర్ డ్యాంలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి.
- జనగామ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలి.
- 50 ఏళ్ల చరిత్ర కలిగిన జనగామ ఆర్టీసీ బస్టాండును ఆధునీకరించి జిల్లా స్థాయి బస్టాండ్‌గా అభివృద్ధి చేయాలి.

ప్రభుత్వ హామీలపై ఉద్యమకారుల ప్రశ్నలివి:

- ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఇంకా ప్రారంభం కాలేదు.
- 2014లో ప్రకటించిన పెంబర్తి–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ కలగానే మిగిలిపోయింది.
- బీసీస్టడీ సర్కిల్, జిల్లా గ్రంథాలయం, జిల్లా పరిషత్ భవనం నిర్మాణం ఇంకా మొదలు కాలేదు.

బతుకమ్మకుంటను సిద్ధం చేయాలి



బతుకమ్మకుంట అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: బతుకమ్మకుంట అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి బతుకమ్మకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కోటి 50 లక్షల రూపాయలతో ప్రారంభించిన బతుకమ్మకుంట అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగతా పనులు కూడా త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ప్రజలకు, చిన్నారులకు టీ, కాఫీ, స్నాక్స్‌లాంటివి అందుబాటులో ఉండేలా ఎస్‌హెచ్‌జీ వారితో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, శ్రీధర్ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు 'పీఎం ధన్–ధాన్య కృషి యోజన' ప్రారంభం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ప్రధానమంత్రి ధన్–ధాన్య కృషి యోజన పథకాన్ని శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. శుక్రవారం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, మత్స్య, కో ఆపరేటివ్ తదితర శాఖల అధికారులతో గ్రామ, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ గూగుల్ మీటింగ్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదలు, యువత, రైతులు, మహిళల జీవితాలను మెరుగుపరచడానికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. వ్యవసాయం మాత్రమే కాకుండా మత్స్యసంపద, పశుసంవర్ధకం తదితర రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టి స్కేల్, టెక్నాలజీ, సంస్థాగత బలాన్ని పెంచి.. తద్వారా సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యమన్నారు. ఈపథకం కింద జిల్లా ఎంపికైందని, 6 సంవత్సరాల వరకు అమలయ్యే ఈ పథకంలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టే వివిధ రకాల కార్యకలాపాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నమన్నారు. ప్రారంభోత్సవ వేడుకలు కలెక్టరేట్‌లో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, డీఆర్డీఓ వసంత, జిల్లా కోఆపరేటివ్ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపర్చాలి

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపర్చాలని ముఖ్యంగా గర్భిణులు, పిల్లల హాజరు శాతం పెరగాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాల్‌లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కందిపప్పు, గుడ్లు, బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. క్లస్టర్ వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరు మెరుగుపరిచేందుకు అవగాహన కల్పించాలన్నారు. సమీక్ష సమావేశంలో ఆర్.బి.ఎస్.కె.డాక్టర్ అశోక్, సీడీపీఓలు, సూపర్ వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌తో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లతో రెవెన్యూకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షించారు. భూసేకరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని అందించాలన్నారు. సంబంధిత రైతుల బ్యాంకు వివరాలను సేకరించేందుకు వచ్చే సోమవారం నుంచి శుక్రవారం వరకు గ్రామ పరిపాలన అధికారుల చేత స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు.

చెదిరిన కల

- స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టేతో ఆశావహుల షాక్
- మరికొన్ని రోజుల పాటు ఎదురుచూపులే..



జనగామ: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడంతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయడంతో అభ్యర్థిత్వం కోసం సిద్ధమైన నేతల్లో నిరాశ అలుముకుంది. గత కొన్ని వారాలుగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్ల హడావిడి అంతా ఇంతా కాదు. రిజర్వేషన్లు అనుకూలంగా రావడంతో సంతోషంగా ఉన్న నాయకులు ఒక్కసారిగా గందరగోళంలో పడ్డారు. ఈసారి రిజర్వేషన్‌అనుకూలంగా వచ్చిందని ఆనందపడ్డ నాయకులు, ఇప్పుడు పాత రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయేమోనని ఆందోళనలో ఉన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేతో ఎన్నికల షెడ్యూల్ నిలిచిపోగా, గ్రామీణ రాజకీయంలో నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. రిజర్వేషన్లు అనుకూలంగా రావడం, అధిష్టానం ఆశీస్సులు ఇస్తుందనే బలమైన నమ్మకంతో గ్రామాల్లో పర్యటనలు చేసి, తమ అనుచర వర్గం మద్దతు కూడగట్టుకున్నారు. ఎన్నికల పోలింగ్ వరకు వెంట నడిచే పార్టీ వర్గాలు చేజారిపోకుండా దసరా పండగ సమయంలో ఎంతోకొంత మొత్తంలో ఖర్చులు పెట్టేశారు. దీంతో అప్పులు చేసి ఖర్చుచేసిన వారికి ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి.

ఎదురుచూపులే..

స్థానిక ఎన్నికలకు సంబంధించి నాలుగు వారాల లోపు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో ఆశావహులు అప్పటివరకు ఆగాల్సిందే. రిజర్వేషన్లు కలిసి వచ్చి అభ్యర్థిత్వం కోసం ఆశపడ్డ వందలాది మంది నాయకులు ఇప్పుడు కోర్టు తీర్పు వచ్చే వరకు ఎదురుచూద్దామనే ఆలోచనలో ఉన్నారు. కొత్త రిజర్వేషన్ల ప్రకారం కొందరికి అవకాశం దొరికినా.. తప్పని పరిస్థితుల్లో పాత వాటితో ముందుకు వెళ్తే అవకాశాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మొదటి విడత జరగాల్సిన లింగాలఘనపురం, దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో రాజకీయ హడావిడి గప్‌చుప్‌గా మారిపోయింది. ఆరు మండలాల్లో కొత్త రిజర్వేషన్లతో అభ్యర్థులు పోటీకి సన్నద్ధ మవుతున్న సమయంలో కోర్టు తీర్పు సందిగ్ధంలో పడేసింది. రాబోయే రోజుల్లో హైకోర్టు తీర్పు ఆధారంగా ఎన్నికల భవిష్యత్తు నిర్ణయించబడనుంది. మొత్తానికి హైకోర్టు స్టే స్థానిక రాజకీయాలను కుదిపివేస్తుండగా, ఎన్నికల సమీకరణాలు మారే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల్లో ఇదే చర్చ జరుగుతోంది.

సీఎంఆర్ సేకరణలో వేగం పెంచండి

- మిల్లర్లకు అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

జనగామ: జిల్లాలో రా రైస్(ముడి ధాన్యం) మిల్లర్లు 2024–25(రబీ)కి సంబంధించిన సీఎంఆర్ బియ్యం వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశం హాల్‌లో పౌర సరఫరాల శాఖతో కలిసి గత సీఎంఆర్, ప్రస్తుత 2025–26 ఖరీఫ్ సీజన్‌లో వచ్చే ధాన్యం దిగుమతిపై నిర్వహించిన సమీక్షలో బెన్ షాలోమ్ పాల్గొని మాట్లాడారు.. వానాకాలం సీజన్‌లో మిల్లర్ల అధ్యక్షులు కోరిక మేరకు ధాన్యం కేటాయింపులు ఉంటాయన్నారు. రా రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ, బ్యాంకు గ్యారంటీలను పౌరసరఫరాల డీఎంకు సమర్పించాలన్నారు. అలాగే మిల్లర్ల అగ్రిమెంట్ సైతం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమీక్షలో డీసీఎస్ఓ సరస్వతి, ఏసీఎస్ఓ డీఎం హథీరామ్, మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్, బెల్దే వెంకన్న, మిల్లర్లు ఉన్నారు.

ఇక.. డీసీసీ అధ్యక్షుల ఎంపిక!

'సంస్థాగత' ఎన్నికలపై దృష్టి సారించిన కాంగ్రెస్

- నేడు జిల్లాలకు ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు
- ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరణ.. 11 నుంచి 18 వరకు ఈ ప్రక్రియ
- ఆ తర్వాత సీఎం, టీపీసీసీ చీఫ్‌తో పరిశీలకుల భేటీ
- నవంబర్ మొదటి వారంలో డీసీసీ అధ్యక్షుల జాబితా ?
- పోటాపోటీగా దరఖాస్తులతో సిద్ధమైన ఆశావహులు



సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించింది. బీసీ రిజర్వేషన్‌లకు సంబంధించిన జీఓ 9, ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆరు వారాలపాటు నిలిచిపోగా.. ఈలోగా ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న జిల్లా కాంగ్రెస్ కమిటీల ఖరారుపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు శనివారం (ఈ నెల 11వ తేదీ) నుంచి 18వ తేదీ వరకు డీసీసీ అధ్యక్షుల రేసులో ఉన్న ఆశావహుల నుంచి జిల్లాల వారీగా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఢిల్లీ, ఇతర ప్రాంతాలనుంచి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్న ఏఐసీసీ పరిశీలకులు శనివారం నుంచి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఇప్పుడున్న డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల వేదికగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

జిల్లాలకు నేడు ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు..

వాస్తవానికి పార్టీ సంస్థాగత నిర్మాణం, పటిష్టత కోసం మూడు నెలల కిందటే ఏఐసీసీ కమిటీలు వేసింది. ఉమ్మడి వరంగల్‌కు ముగ్గురు ఏఐసీసీ పరిశీలకులతోపాటు ఒక్కో జిల్లాకు ఇద్దరు నుంచి ముగ్గురు టీపీసీసీ పరిశీలకులను నియమించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ పరిశీలకులతో భేటీ అయి పలు సూచనలు చేశారు. ఏఐసీసీ పరిశీలకులు నబజ్యోతి పట్నాయక్ (హనుమకొండ, వరంగల్), జాన్సన్ అబ్రహం (ములుగు, జేఎస్ భూపాలపల్లి), దేబాసిస్ పట్నాయక్ (జనగామ)లు దరఖాస్తులు, డీసీసీ ఎన్నికలను పరిశీలించనున్నారు. అదేవిధంగా టీపీసీసీ పరిశీలకులుగా హనుమకొండ, వరంగల్ జిల్లాలకు గాలి అనిల్‌కుమార్, దుర్గం భాస్కర్, మక్సూద్ అహ్మద్, గుంజ రేణుకా నారాయణ, ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాలకు జంగా రాఘవరెడ్డి, అఫ్సర్ యూసుఫ్ ఝుహి, ఇ.సుబ్బారావు, ఎ.సంజీవ్ ముదిరాజ్, జనగామ, మహబూబాబాద్‌లకు కె.శంకరయ్య (ఎమ్మెల్యే), ఎండీ అవేజ్, పీసరి మహిపాల్ రెడ్డి, కె.శ్రీకాంత్‌జాదవ్, జువ్వాడి ఇందిరారావు పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. జిల్లాల వారీగా కార్యాలయాల్లో డీసీసీ ఆశావహులనుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

పోటాపోటీగా ఆశావహులు..

- డీసీసీ కోసం పోటీపడే వారి సంఖ్య జిల్లాల్లో చాంతాడులా పెరుగుతోంది.
- ఇప్పుడున్న డీసీసీ అధ్యక్షులు మార్పు తథ్యమనుకుంటే కొత్తగా హనుమకొండ జిల్లా నుంచి కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జంగా రాఘవరెడ్డి, ఈవీ శ్రీనివాస్‌రావు, బట్టి శ్రీనివాస్, పింగిళి వెంకట్రాం నర్సింహారెడ్డి, బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, కట్ల శ్రీనివాస్‌లతోపాటు మరి కొంతమంది దరఖాస్తు చేసుకుంటారనే ప్రచారం ఉంది.
- వరంగల్ నుంచి ఇప్పుడున్న అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నమిండ్ల శ్రీనివాస్, ఎంపీ ఆనంద్, బొంపెల్లి దేవేందర్‌రావు, గోపాల నవీన్‌రాజ్, నల్గొండ రమేశ్, నర్సంపేట మాజీ ఎంపీపీ టి.రవిందర్‌రావు, పిన్నింటి అనిల్‌రావు తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి.
- జయశంకర్ భూపాలపల్లి డీసీసీ కోసం మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్, చల్లూరి మధు తోపాటు ఎనిమిది మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి స్థానంలో హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, సింగపురం ఇందిర, మొగుళ్ల రాజిరెడ్డి, బండ శంకర్, లకావత్ ధన్వంతి, లక్ష్మీనారాయణతోపాటు పలువురు ఆశావహులు సిద్ధమయ్యారు.
- ములుగు జిల్లాలో ప్రస్తుత అధ్యక్షుడు పైడాకుల అశోక్, సూర్య(మంత్రి సీతక్క కుమారుడు) మధ్య ఇప్పటికే పొసగడం లేదు. ఇక్కడినుంచి సూర్య సీరియస్‌గానే ఆశిస్తున్నారు. పైడాకుల అశోక్, కుంజ సూర్య, మల్లాడి రాంరెడ్డి, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బాదం ప్రవీణ్ తదితరులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- మహబూబాబాద్‌లో ఇప్పుడున్న జె.భరత్‌చంద్రారెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, నునావత్ రాధతోపాటు ఏడెనిమిది మంది పేర్లు వినిపిస్తున్నాయి.
- ఏదేమైనా దరఖాస్తుల ప్రక్రియ 18న ముగియగానే ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు, సీఎం, టీపీసీసీ దృష్టికి జాబితాను తీసుకెళ్లనున్నారని సమాచారం. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్‌లు, ఇన్‌చార్జ్ మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో సంప్రదింపులు జరిపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్, మహిళ.. ఇలా సామాజిక కోణాలను దృష్టిలో పెట్టుకుని నవంబర్ మొదటి వారంలో అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉందన్న చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

నేడు జిల్లాకు పరిశీలకులు..

జనగామ: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక కోసం ఏఐసీసీ పరిశీలకులు, టీపీసీసీ ప్రతినిధి శనివారం జిల్లాకు రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి శాసన, పార్లమెంట్ సభ్యులు, మండల, అనుబంధ కమిటీలు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, జిల్లా గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ఎస్, దేవస్థాన కమిటీ చైర్మన్లు, తాజా, మాజీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరై ఆసక్తి ఉన్న నాయకులు డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ మెంబర్లతో ముఖాముఖి అభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. ఈ నెల11వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో జనగామ నియోజకవర్గ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. 12వ తేదీన ఉదయం 11 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ నియోజకవర్గ నాయకులతో సమావేశం ఉంటుందని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2.30గంటలకు పాలకుర్తి పట్టణ కేంద్రంలో ఆ నియోజకవర్గ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. అభిప్రాయ సేకరణలో డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

క్లుప్తంగా

నేటినుంచి కేయూ ఫార్మా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని (1974–2025) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నేటినుంచి (11, 12తేదీల్లో) హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రారంభానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, గౌరవ అతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, స్పీకర్స్‌గా కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, ఫార్మసీ కాలేజీ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షురాలు జె.కృష్ణవేణి తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొననున్నారు.ఈనెల 12న ఫ్యూచర్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ ఫార్మా అకడమిక్ పర్స్పెక్టివ్ అనే అంశంపై చర్చించనున్నారు. కేయూ ఫార్మసీ కాలేజీ వివిధ చోట్లనుంచి పూర్వ విద్యార్థులు పాల్గొనబోతున్నారు. ఈఏడాది డిసెంబర్ 27, 28తేదీల్లో కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల ముగింపు సమావేశాలు నిర్వహించబోతున్నారు.

భారత జట్టుకు కెప్టెన్‌గా ప్రశాంత్


ప్రశాంత్

రాయపర్తి : వరల్డ్ పారా వాలీ సిట్టింగ్ వాలీబాల్ వరల్డ్ కప్ మెన్స్ –2025లో భారత జట్టుకు కెప్టెన్‌గా వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గాడిపల్లి ప్రశాంత్ వ్యవహరించనున్నారు. గాడిపల్లి వెంకటయ్య, సోమక్క దంపతుల పెద్ద కుమారుడు ప్రశాంత్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చదువుతున్నాడు. అలాగే ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్స్ ముంబైలో టాక్స్ అసిస్టెంట్ (స్పోర్ట్స్ కోటా)గా సేవలు అంది స్తున్నాడు. పదేళ్లుగా సిట్టింగ్ వాలీబాల్ క్రీడలో తెల ంగాణ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రశాంత్ అనేకసార్లు జాతీయ స్థాయి ప్రదర్శనలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తన క్రీడా ప్రతిభను నిలబెట్టుకుంటూ ఐదుసార్లు జాతీయ స్థాయిలో పాల్గొన్నాడు. 2023లో ఈజి ప్ట్‌లోని కైరోలో జరిగిన వరల్డ్ పారా వాలీ వరల్డ్ కప్ (మెన్స్ అండ్ ఉమెన్ చాంపియన్ షిప్)లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ప్రశాంత్ ఇప్పుడు అమెరికా ఇండియానా స్టేట్ ఫోర్ట్ వేన్‌లో ఈనెల 12నుంచి 18వ తేదీవరకు జరగబోయే వరల్డ్ కప్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. కెప్టెన్‌గా అవకాశం రావడంతో ప్రశాంత్ ఆనందం వ్యక్తం చేశాడు. ప్రశాంత్ విజయంపై కోచ్ సింగారపు బాబు, నాగేశ్వర్ రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా తరఫున పలువురు అభినందనలు తెలియజేశారు.

స్నానానికి వెళ్లి యువకుడి గల్లంతు

● ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల గాలింపు

ఎస్ఎస్‌తాడ్వాయి : ఓ వ్యక్తి అంత్యక్రియలు ముగిసిన తర్వాత చెరువులో స్నానానికి వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన మండలంలోని బీరెల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. బీరెల్లి గ్రామానికి చెందిన బాసాని రామకృష్ణ మృతిచెందడంతో శుక్రవారం దహన సంస్కారాలు నిర్వహించగా అదే గ్రామానికి చెందిన మంకిడి పవన్ (25) హాజరయ్యాడు. అనంతరం స్నానం చేసేందుకు పవన్‌తో పాటు మరో ముగ్గురు యువకులు గ్రామ సమీపంలోని చెరువులోకి వెళ్లారు. ఈతకు వెళ్లిన ముగ్గురు బయటకు రాగా పవన్ చెరువులో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభించలేదు. తాడ్వాయి తహసీల్దార్ సురేష్‌బాబు చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో ప్రయత్నాలు చేసిన రాత్రి వరకు కూడా గల్లంతైన పవన్ జాడ దొరకలేదు.

నియామకమెప్పుడో..!

● దిగువ కేడర్‌కు సబ్ ఇంజనీర్లుగా అవకాశం
● ఆందోళనలో అన్యాయానికి గురైన 24 మంది అభ్యర్థులు
● అక్రమాలను గుర్తించిన ప్రత్యేక కమిటీ



కన్వర్షన్ భర్తీతో అభ్యర్థులకు నష్టం

427 సబ్ ఇంజనీర్ పోస్టుల్లో 24 మంది అనర్హులను భర్తీ చేశారు. అర్హులైన 24 మందిని పక్కన పెట్టారని విచారణ కమిటీ తేల్చింది. అక్రమంగా ఉద్యోగాలు చేస్తున్న 24 మందికి యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. దీంతో కోర్టును ఆశ్రయించగా వారు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా న్యాయంగా ఉద్యోగాలు దక్కాల్సిన వారు మాత్రం యాజమాన్యం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. మరో వైపు ఖాళీగా ఉన్న సబ్ ఇంజనీర్ల పోస్టులు అర్హత ఉన్న దిగువ కేడర్ ఉద్యోగులను కన్వర్షన్ ద్వారా భర్తీ చేస్తుండడంతో నష్టపోయిన అభ్యర్థులు తమ భవిష్యత్ ఏంటనే ఆలోచనలో పడ్డారు. వయోభారం మీద పడుతుండడంతో అభ్యర్థులు రోజు రోజుకూ కృంగిపోతున్నారు. ఇప్పటికైనా తమకు జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని గమనించి వెంటనే తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సబ్ ఇంజనీర్ అభ్యర్థులు కోరుతున్నారు.

హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్‌లో చేపట్టిన సబ్ ఇంజనీర్ల నియామకంలో అన్యాయానికి గురైన తమను ఎప్పుడు విధుల్లోకి తీసుకుంటారని అభ్యర్థులను ఎదురు చూస్తున్నారు. యజమాన్యం చేసిన తప్పిదాలు, అక్రమాలకు ఏడేళ్లుగా 24మంది అభ్యర్థులు నియామకాల కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఈ క్రమంలో దిగువ కేడర్ ఉద్యోగులకు సబ్ ఇంజనీర్లుగా కన్వర్షన్‌కు అవకాశం కల్పించడంతో పోస్టులన్ని వారిచే భర్తీ చేస్తే తమకు పోస్టులు లేకుండా పోతాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన పోస్టుల సంఖ్య..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 497 సబ్ ఇంజనీర్ల భర్తీకి 2018, మే 24న నోటిఫికేషన్ విడుదల చేశారు. అదే ఏడాది జూలై 8న రాత పరీక్ష నిర్వహించి, ఆగస్టు 31న ఫలితాలు ప్రకటించారు. మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సెప్టెంబర్ లో పాత సర్కిల్ వారీగా వేర్వేరు తేదీల్లో కాల్ లెటర్ పంపించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న 497మందికి కాకుండా 427 మందికి మాత్రమే కాల్ లెటర్ పంపి, 70 పోస్టులు తగ్గించారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియ నిలిపివేశారు. కోడ్ తర్వాత డిసెంబర్‌లో మరోసారి సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని కాల్ లెటర్ పంపారు. దీంతో మరో 24 పోస్టులు తగ్గించారని అర్హులైన అభ్యర్థులు తెలిపారు. ముందు కాల్ లెటర్ అందుకుని రెండోసారి రాని అభ్యర్థులు వెంటనే హైకోర్టును ఆశ్రయించగా అందరికీ తిరిగి జారీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు 427 మందికి కాల్‌లెటర్ పంపి పోస్టులు భర్తీ చేశారు. అయితే ఇక్కడ కోర్టు ఆదేశాలతో కాల్ లెటర్ పొందిన 24 మందిని పక్కన పెట్టారు. తాము అధికారులను ఈ విషయమై సంప్రదిస్తే కోర్టు కాల్ లెటల్ మాత్రమే జారీ చేయమని చెప్పిందని, ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పలేదంటూ తప్పించుకున్నారని అభ్యర్థులు వాపోయారు.

అక్రమంగా నియామకాలు..

సబ్ ఇంజనీర్ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు టీజీ ఎన్పీడీసీఎల్ యజమాన్యానికి ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీజీ ఎన్పీడీసీఎల్ పాత పాలక మండలిని రద్దు చేసింది. ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్ రెడ్డిని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా, సీనియర్ సీజీఎంలను ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా నియమించింది. ఈ కమిటీ రాగానే అభ్యర్థులు సీఎండీని కలిసి వినతి పత్రం అందించి తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. దీనికి తోడు ప్రజాపాలనలో ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణకు చేపట్టారు. టీజీ పీఎస్ఎస్‌సీకి చెందిన ఒకరు, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ నుంచి ఇద్దరేసి అధికారులతో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. నియామకాల ప్రక్రియ మొత్తాన్ని వడపోసి చివరకు అక్రమాలు జరిగినట్లు తేల్చింది. 24 మంది నియామకాలు అక్రమంగా జరిగినట్లు, అర్హత లేని వారిని నియమించినట్లు విచారణ కమిటీ తేల్చింది.

డిజిటల్ హుండీల ఏర్పాటు


డిజిటల్ హుండీ ఏర్పాటు చేస్తున్న సునీల్‌కుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద భక్తులు ఆన్‌లైన్‌లో కానుకల చెల్లింపునకు తాడ్వాయి కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో పూజారులతో కలిసి శుక్రవారం డిజిటల్ హుండీలు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకునేందుకు మేడారానికి భక్తులు బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో వేల సంఖ్యలో వస్తున్నారు. వారు ఇబ్బంది పడకుండా గూగుల్, ఫోన్ పే ఆన్‌లైన్ చెల్లింపుల కోసం కెనరా బ్యాంక్ అధికారులు క్యూఆర్ స్కాన్ కోడ్ డిజిటల్ హుండీ అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ లకావత్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలు సమ్మక్క–సారలమ్మ ఖాతాలో నేరుగా జమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారులు కొక్కెర కృష్ణయ్య, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ జగదీశ్వర్ పాల్గొన్నారు.

వైద్యవిద్యకు ఆర్థికసాయం అభినందనీయం

● కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ నందకుమార్ రెడ్డి


వైద్య విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు, అతిథులు

హన్మకొండ: వైద్య విద్యలో ప్రవేశం సాధించి ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు నీట్–మెడికో పేరెంట్స్ అసోసియేషన్ అండగా నిలిచి చేయూతనందించడం అభినందనీయమని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.వి.నందకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో నీట్–మెడికో పేరెంట్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో వైద్యవిద్యలో ప్రవేశం పొందిన 10 మంది విద్యార్థులకు మొత్తం రూ.2.70 లక్షలు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.వి.నందకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.నాగార్జునరెడ్డి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. ఫీజు చెల్లించే స్థోమత లేని 30 మంది విద్యార్థులకు నెలకు రూ.3,500 వచ్చే ఏర్పాట్లు చేస్తానన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో బుక్స్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తానన్నారు. నీట్–మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణచారి, సభ్యులు రావుల మధు, ఆకుల భాస్కర్, నరేందర్, యాదగిరి, కందిమల్ల జితేందర్, ఇందిర, రోజా, బాబురావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేఎంసీలో వైట్‌కోట్ సెరిమనీ


వైట్ కోట్ సెరిమనీలో పాల్గొన్న విద్యార్థులు, వైద్యులు

ఎంజీఎం : కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఎంబీబీఎస్ విద్యార్థులకు వైట్ కోట్ సెరిమనీ ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సుంకరనేని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఇంటర్నేషనల్ రేడియాలజిస్ట్, చికాగో(కేఎంసీ పూర్వ విద్యార్థి) డాక్టర్ సురేష్ రెడ్డి, సీనియర్ అలుమ్నస్ డాక్టర్ వీ.ఎల్.ఎన్.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వైద్య వృత్తి ప్రాధాన్యత, సేవా దృక్పథం, నైతిక విలువలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రి న్సిపాల్ విద్యార్థులతో హిపోక్రటిక్ ప్రమాణం చేయించారు. ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

యువకుడికి పాముకాటు..

● చికిత్స పొందుతూ మృతి


రాకేశ్ (ఫైల్)

బచ్చన్నపేట : పాముకాటుతో చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని బోనకొల్లూర్ గ్రామానికి చెందిన దయ్యాల పద్మ–కనకయ్య దంపతుల కుమారుడు రాకేశ్ (19) ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఈ నెల 4వ తేదీన వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన రాకేశ్‌కు పాముకాటు వేసింది. అయితే పాము కనిపించకపోవడంతో తేనెటీగ కుట్టిందని అదే రోజు గ్రామంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జనంలో పాల్గొని భోజనం చేసి పడుకున్నాడు. మరుసటి రోజు కాలు తిమ్మిరిగా ఉండడంతో జనగామ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో బాధిత కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రైల్వే కార్మికులకు మెరుగైన వైద్యం

● దక్షిణ మధ్య రైల్వే పీసీఎండీ డాక్టర్ నిర్మలారాజారాం


కాజీపేట: సీపీఆర్ డెమోను తిలకిస్తున్న నిర్మల, నారాయణస్వామి తదితరులు

కాజీపేట రూరల్ /డోర్నకల్ : రైల్వే కార్మికులకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రైల్వే శాఖ నిరంతరం కృషి చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ (పీసీఎండీ) డాక్టర్ నిర్మలారాజారాం అన్నారు. కాజీపేట రైల్వే ఆస్పత్రిని శుక్రవారం సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ నారాయణస్వామితో కలిసి వారు సందర్శించి తనిఖీ చేశారు.అలాగే సకల వసతులతో డోర్నకల్‌లో పునః నిర్మించిన రైల్వే ఆస్పత్రిని డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్, డీఆర్‌యూసీసీ సభ్యులు ఖాదర్, రైల్వే చీఫ్ మెడికల్ సూపరిండెంటెంట్ నారాయణ స్వామి, రైల్వే ఆస్పత్రి డాక్టర్ సునీల్ కుమార్ కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రి నుంచి కార్మికులకు అన్ని రకాల మెరుగైన వైద్యం అందించేందుకు నగరంలో మూడు రెఫరల్ ఆస్పత్రుల నుంచి వైద్యం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఏకశిల ఆస్పత్రి ఆధ్వర్యంలో సీపీఆర్ డెమోను డాక్టర్ ఆసిఫ్ ఇక్బాల్ నిర్వహించగా ఆమె అభినందించారు. రైల్వే ఆస్పత్రి హాల్‌లో డాక్టర్లు నిరంజన్ రావు, నరేందర్ హిర్వాని, యాకూబ్, దీరజ్, హరిబాబులతో సమావేశమై పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో మొక్క నాటారు.

రైల్వే నాయకుల వినతులు

కాజీపేట రైల్వే ఆస్పత్రిని తనిఖీ చేసేందుకు వచ్చిన డాక్టర్ నిర్మలారాజారాంకు రైల్వే మజ్దూర్ యూనియన్ అన్ని బ్రాంచీల కోఆర్డినేటర్ నాయిని సదానందం, రైల్వే సంఘ్ సీడబ్ల్యూఎస్సీ మెంబర్ సాదినేని వెంకటనారాయణ, ఎస్సీ,ఎస్టీ నాయకులు బి.వీరన్న, కెఎస్.రావు, ఆర్.కుమార్, బి.జక్రియ ఆధ్వర్యంలో వైద్య సమస్యలను పరిష్కరించి, ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.

బీసీ రిజర్వేషన్లపై అగ్రవర్ణాల కుట్ర


రెడ్డి జాగృతి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

● బీసీ సంఘాల ఆధ్వర్యంలో రెడ్డి జాగృతి దిష్టిబొమ్మ దహనం

నయీంనగర్ : స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ–9పై హైకోర్టు స్టే విధించడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నేతృత్వంలో శుక్రవారం కేయూ జంక్షన్‌లో రాస్తారోకో, ధర్నా చేపట్టారు. అనంతరం జీఓ–9కి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు, హై కోర్టులను ఆశ్రయించిన రెడ్డి జాగృతి సంఘం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరీ రవికృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారీ కింది నుంచి పై కోర్టుల వరకు వేదికగా చేసుకొని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కోర్టులు కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ఆమోదం ఉంటే బీసీ రిజర్వేషన్లకు కోర్టులో స్టే వచ్చేది కాదని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటోందన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీసీ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ ఎందుకు బాధ్యత తీసుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ గల్లీలో ఒక మాట ఢిల్లీలో ఒక మాట మాట్లాడుతూ.. బీసీలను తప్పు దోవ పట్టిస్తూ, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయడం సిగ్గుచేటన్నారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టు ఇచ్చిన స్టే అగ్రవర్ణాల కుట్ర అని అన్నారు. వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. రెడ్డి కులస్తులంతా బీసీ వ్యతిరేకులేనని, బీసీ సమాజమంతా రెడ్డి కులస్తులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి పిటిషన్లు అధర్మమని, బీసీ రిజర్వేషన్లు ధర్మమన్నారు. బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ నిరసనలో నాయకులు సాయిని నరేందర్, కందికొండ వేణుగోపాల్, బోనగాని యాదగిరి గౌడ్, తాడిశెట్టి క్రాంతి, గడ్డం భాస్కర్, బచ్చు ఆనందం, వైద్యం రాజగోపాల్, దాడి మల్లయ్య యాదవ్, పద్మజాదేవి, శోభారాణి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్ మాటల్లో నేర్పరి సీఎం రేవంత్

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు సతీష్‌కుమార్, రాజయ్య, శంకర్‌నాయక్ తదితరులు

హన్మకొండ: బ్రోకర్ మాటలు మాట్లాడడంలో సీఎం రేవంత్ రెడ్డి నేర్పరి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు సాధ్యం కాదని జీఓ–9 తీసుకువచ్చి బీసీలను మోసం చేశారని ధ్వజమెత్తారు. మాటలతో కాంగ్రెస్ అగ్ర నాయకత్వాన్ని, ప్రజలను మోసం చేసి సీఎం అయ్యారని విమర్శించారు. యూరియా కొరతతో ప్రజలు కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తరిమి కొట్టే పరిస్థితి నెలకొందని, దీంతోపాటు హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిసి వారి దృష్టి మళ్లించేందుకు బీసీ రిజర్వేషన్ల డ్రామాను ముందుకు తీసుకువచ్చాడని దుయ్యబట్టారు. కేంద్రంలో, రాష్ట్రంలో 55 ఏళ్లు అధికారంలో ఉండి కాంగ్రెస్ ఎందుకు బీసీలకు రిజర్వేషన్లు పెంచలేదని ప్రశ్నించారు. రాష్ట్రాలకు రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం ఇవ్వాలని అనడం నేరమని, అడిగిన వారిని జైల్లో పెట్టాలని గతంలో రేవంత్ మాట్లాడిన వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సీఎం రేవంత్ ఒక్క మీటింగ్ పెట్టలేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేదని, దీన్ని బట్టి వీరికి ఎన్నికలు జరగవని ముందే తెలుసని అర్థమవుతుందన్నారు. బీసీలను సీఎం రేవంత్, కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాలని, తాము కూడా మద్దతుగా వస్తామన్నారు. అంతకుముందు కాంగ్రెస్ బాకీ కార్డులను ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్ కుమార్, శంకర్ నాయక్, డాక్టర్ తాటికొండ రాజయ్య, నాయకులు జోరిక రమేష్, చింతల యాదగిరి, చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, బండి రజనీకుమార్, రామ్మూర్తి, పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.


పోలీసుల సాక్షిగా ఎమ్మెల్యే అనుచరుడి దాడి

● సీసీ కెమెరాల్లో రికార్డు

వరంగల్ క్రైం: నగరంలోని కేయూసీ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పోలీసులు చూస్తుండగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఓ ఎమ్మెల్యే అనుచరుడు ఓ వ్యక్తిపై చేసిన దాడి అందరిని ఆశ్చర్యపరిచింది. దాడిని చూసి అవాక్కైన ఎస్సై బాధితుడిని, దాడికి పాల్పడిన ఎమ్మెల్యే అనుచరుడిని ఇన్‌స్పెక్టర్ ముందు ప్రవేశపెట్టినప్పటికి అక్కడ కూడా నానా హంగామా చేశాడు. ఇన్‌స్పెక్టర్ ముందు ఉన్న కుర్చీని లాక్కొని బాధితుడిని నోటికి వచ్చినట్లు తిట్టడం.. స్పందించాల్సిన ఇన్‌స్పెక్టర్ బయట కొట్టుకుంటే తమకేం సంబంధం అనడంతో బాధితుడి తరఫున వచ్చిన నాయకులు పోలీసులతో వాగ్వాదం చేశారు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండకు చెందిన సూర్యకిరణ్ అనే వ్యక్తి ఆత్మకూర్‌కు చెందిన గొని శ్రీకాంత్ దగ్గర ఫార్చునర్ కారు కుదువపెట్టి రూ.2లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ తరువాత ఇంట్లో గొడవలు అవుతున్నాయని, మరో కారు పెట్టుకొని మొదటగా పెట్టిన కారును ఇవ్వాలని బతిమాలి ఫార్చునర్‌ను తీసుకెళ్లాడు. కానీ, రెండోసారి కుదువ పెట్టిన కారు సెల్ఫ్ డ్రైవ్‌ది కావడంతో ఓనర్ వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అధికారులు శుక్రవారం ఓ కాని స్టేబుల్‌ను పంపి ఆత్మకూర్‌లో ఉన్న కారును తెప్పించడంతోపాటు గొని శ్రీకాంత్‌ను తీసుకువచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆ పోలీస్ స్టేషన్ ఎస్సై చాంబర్ ముందు నిల్చున్న శ్రీకాంత్‌ను కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే అనుచరుడు పల్లె రాహుల్‌రెడ్డి వచ్చి తాను పిలిస్తే రావా..? అంటూ దాడి చేశాడు. ఇదంతా పోలీస్ స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు కావడం గమనార్హం. ఎమ్మెల్యే అనుచరుడిపై కేసు నమోదు చేయాలని బాధితుడు ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికి కేసు నమోదు కాలేదు. ఈ విషయంలో పోలీసుల తీరుపై ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని బాధితులు చెప్పారు. కాగా, ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలపడం గమనార్హం.

సికింద్రాబాద్-కాజీపేట మధ్య 3వ, 4వ రైల్వేలైన్

110 కి.మీ నిర్మాణానికి రంగం సిద్ధం
రూ.2,837 కోట్ల వ్యయ అంచనా



కాజీపేట రూరల్ : రైల్వేశాఖ సికింద్రాబాద్–కాజీపేట మధ్య 3వ, 4వ రైల్వే లైన్ నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు రూ.2,837 కోట్ల వ్యయంతో సికింద్రాబాద్ (ఘట్‌కేసర్) నుంచి కాజీపేట వరకు 110 కి.మీ.తో మేడ్చల్, యాదాద్రి, జనగామ, హనుమకొండ జిల్లాలను కలుపుతూ 3వ, 4వ రైల్వే లైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు శుక్రవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటికే బల్లార్షా నుంచి కాజీపేట వరకు అక్కడక్కడ చిన్న చిన్న బిట్ వర్క్స్ తప్ప 3వ లైన్ నిర్మాణం పూర్తయ్యింది. కాజీపేట–సికింద్రాబాద్ మధ్య 3వ లైన్ కావాల్సి ఉంది. కొత్తగా చేపట్టనున్న 3, 4వ లైన్ నిర్మాణ ప్రాజెక్ట్ కాలం 4 ఏళ్లు పట్టనుంది. ముఖ్యంగా ఈ మార్గంలో బొగ్గు, సిమెంట్ ఉత్పత్తి రవాణాలో రైళ్ల ట్రాఫిక్ తగ్గుతుంది. ప్రస్తుతం 110 కి.మీ.వేగంతో రైళ్లు వెళ్తుండగా, 3, 4వ రైల్వే లైన్ మార్గాలు పూర్తయితే గంటకు 130 కి.మీ.వేగంతో రైళ్లు ప్రయాణించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు ప్రస్తుతం సికింద్రాబాద్–కాజీపేట వరకు ఉన్న రైళ్ల సమయంలో అరగంట తగ్గుతుందని భావిస్తున్నారు.

పెన్షనర్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

హన్మకొండ అర్బన్ : రిటైర్డ్ పెన్షనర్లకు వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతారాం మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2024,మార్చి నుంచి రిటైర్డ్ అయిన పెన్షనర్లకు బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనరీ బెనిఫిట్స్ రాక ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.వైఎస్ రాజశేఖర రెడ్డి ఈహెచ్ఎస్ ద్వారా ఉచిత వైద్యం పొందుతున్నామని, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకం రూపొందించి సత్వరం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండ్యాల బ్రహ్మయ్య, జె.ప్రభాకర్ రెడ్డి, నారాయణగిరి వీరన్న, వన్నాల రాజమల్లు, సుధాకర్, శంకరయ్య, మందువ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

'డ్రీమ్‌బిగ్' ఆడియో ఆవిష్కరణ


డ్రీమ్‌బిగ్ సినిమా ఆడియో, వీడియోను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ తదితరులు

హన్మకొండ చౌరస్తా : వరంగల్ నగరానికి చెందిన ఫిజియోథెరపిస్టు రావుల రామకృష్ణ నిర్మించిన 'డ్రీమ్ బిగ్' సినిమా ఆడియో, వీడియో ఆవిష్కరణ శుక్రవారం హనుమకొండలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఫిజియోథెరపిస్టుల అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక భావాలు ఉన్న సినిమాలను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు.ఆలోచనలు గొప్పగా ఉంటేనే విజయం తథ్యమని వివరించారు. భవిష్యత్‌లో భావితరాలకు ఉపయోగపడే సినిమాలను తీయాలని, తమవంతు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. ఫిజియోథెరపిస్టు ఒక డైరెక్టర్‌గా సినీ రంగంలో అడుగుపెట్టి ఎన్నో మంచి సినిమాలు నిర్మించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఒడితల రాము, శివరామకృష్ణ, సురేష్, ప్రకాశ్, క్రాంతికుమార్, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.